# విజేత

ఉద్విగ్నత, ఉత్కంఠత నిలువునా ఊపేస్తోంటే ఎలక్ట్రాన్ మైక్రోస్కోపులోంచి క్యాన్సర్ కణాలని పరిశీలిస్తున్నాడు విజయ్.

ఒక ప్రక్క ఆశ మరో ప్రక్క నిరాశ – రెండిట్ల మధ్య టెన్షన్‌తో నలిగిపోతున్నాడు.

ఇన్నాళ్ళ శ్రమ ఫలించి తీరాలన్న ఆకాంక్ష ధైర్యం చెబుతోంటే ఏదో తెలీని నిస్పృహ వెనక్కినెక్కిలాగుతూ భయాన్ని నరాల్లోకి ఇంజెక్ట్ చేస్తోంటే ఉగ్గ బట్టి పరిశోధనా ఫలితాన్ని పరిశీలిస్తున్నాడు.

'మైగాడ్!' అప్రయత్నంగా వెలువడిందతడి నోట్లోంచి.

మళ్ళీ ఫెయిల్యూర్!

ఒంట్లో రవ్వంత శక్తి కూడా లేనట్టు కూలబడ్డాడు.

ఎలాగైనా సాధించి తీరాలని మూడేళ్ళ నుంచి ప్రయోగాలు చేస్తున్నాడు. రాత్రీ పగలూ పరిశోధనే ధ్యాసగా ధ్యానంగా తపస్సు చేశాడు.

ఫలితం! దారుణమైన ఓటమి!

కన్నీళ్ళు పొంగి వచ్చాయి. మౌనంగా రోధించాడు.

ఆ బాధని వేదనని ఇంకెవర్తోనైనా పంచుకుంటే గుండెభారం తగ్గుతుందన్పించింది. భార్య గుర్తు రాలేదు. గురువు గుర్తొచ్చారు.

అతడి మనస్సులోని భావనని ఏ తరంగాలు చేరవేశాయో గాని సెల్ మ్రోగింది. లైన్లో గురువు ప్రొఫెసర్ పరబ్రహ్మం.

"హాయ్ మై బోయ్! ఎనీ ప్రోగ్రెస్?"

"సారీ సర్. అయామె టోటల్ ఫెయిల్యూర్!" బరస్టయ్యాడు.

"ఇట్స్ బ్యాడ్. అలాంటివి సహజం. ఒక్కో ఫెయిల్యూరూ నిన్ను సక్సెస్‌కి మరింత దగ్గరికి చేరుస్తుంది. డిస్కరేజ్ అవ్వొద్దు. నువ్వు చేస్తున్నది సామాన్య రీసెర్చి కాదు. మెడికల్ ఫీల్డ్‌ని కుదిపేసే అత్యద్భుత పరిశోధన....."

"నా ఐడియా తప్పేమో అన్పిస్తోంది సార్..."

"మైస్ మీద సక్సెస్ అయ్యిందిగా..."

"రాబిట్స్ మీద ఘోరంగా ఫెయిలయింది...."

"యస్. అంటే ఐడియాలో లోపం లేదు. దాన్ని ప్రయోగించే పద్ధతిలోనే లోపం వుంది. సో నీ మెదడుని మథించు. రకరకాల ఆల్టర్నేటివ్స్ కన్సిడర్ చెయ్యి. మరో దారిలో వెళ్ళు. ఇది స్లో ప్రోసెస్. బట్ నువ్వు సాధిస్తావు. నాకా నమ్మకం వుంది. నిరాశా నిస్పృహల్ని నీ దరికి చేరనివ్వొద్దు. ఓకే? టూ త్రీ డేస్ రెస్ట్ తీసుకో. రీచార్జి ఐ నవోత్సాహంతో మళ్ళీ మొదలు పెడుదువుగాని... ఆల్ ద బెస్ట్ మై బోయ్..."

"ఓకేసార్... గుడ్ నైట్ సార్..."

మళ్లీ మొదలు పెట్టాలి...!

నిట్టూరుస్తూ ల్యాబ్ లాక్ చేసి బయటి కొచ్చాడు.

అమావాస్య చీకటి జల్లులుగా కురుస్తోంది. చల్లగాలి రివ్వున వీస్తోంది. పార్కింగ్ వైపు నడుస్తూ సిగరెట్ వెలిగించాడు.

గాఢంగా దమ్ములాగి పొగ వదుల్తూ రిలీఫ్ ఫీలయ్యాడు.

మరేం చేయాలి? ప్రయోగంలో ఎలాంటి మార్పు చెయ్యాలి? లోపం ఎక్కడ జరిగి వుంటుంది?

పెదవి కొరుక్కున్నాడు. చేతివేలు చురుక్కుమంది. సిగరెట్ పీక వదిలేశాడు.

తల పంకిస్తూ బైక్ స్టార్ట్ చేశాడు. ఇంటికెళ్ళాడు.

డూప్లికేట్ కీ తో తాళం తీసి లోపలి కెళ్ళాడు.

అలికిడికి మెలకువ వచ్చింది రమ్యకి. "ఇప్పుడు తెల్లారిందా! ఫ్రిజ్‌లో అన్నం కూర ఉన్నాయి. ఓవెన్‌లో వేడి చేసుకోండి..."

దుస్తులు మార్చుకుని స్నానం చేసొచ్చి మంచం మీద వాలాడు.

"అన్నం తినరూ?!"

"ఆకలిగా లేదు"

"వేళా పాళా వుంటేగా! ఎందుకొచ్చిన రీసెర్చి అంటే వినరు. హాయిగా టెన్ టు ఫైవ్ జాబ్ చూసుకుంటే ఆరోగ్యమన్నా బావుంటుంది..."

ఆమె ఏదేదో గొణుగుతోంది. అతడి చెవికేమీ ఎక్కడం లేదు.

మెదడు పొరల మధ్య మథన. ఆలోచనాసాగర మథనం.

ఎక్కడ రాంగ్ స్టెప్ వేసుంటాడు?

నిద్ర పట్టడం లేదు. అటూ ఇటూ దొర్లుతున్నాడు.

"తిన్నగా పడుకోలేరూ. సరైన నిద్ర లేకపోతే రేపు ఆఫీసులో పని చెయ్యలేను. అసలే రిలీజ్ టార్గెట్ దగ్గర పడింది..." కసురుకున్నట్టుగా అంది అటు తిరిగి పడుకుంటూ.

బిగుసుకు పోయినట్టు ఉండిపోయాడు విజయ్.

"అన్నట్టు చెప్పడం మరచిపోయాను. రేపు మా చిన్నాన్నగారమ్మాయి పెళ్లికి భీమవరం వెళ్ళాలి. ల్యాబూ గీబూ అనకండి. ట్రెయిన్‌కి రిజర్వేషన్ చేసేశాను..."

అతడు మౌనంగా... ఆమె గురక పెడుతూ.....!

విజయ్ కాఫీ త్రాగుతోంటే అంది రమ్య "రాత్రి చెప్పింది విన్నారుగా. ఈవెనింగ్ ఊరి కెళ్ళాలి..."

అతడు జవాబివ్వలేదు. ఆమె ఆశించనూ లేదు.

ఆమె మాట వేదవాక్కు ఆచరించకపోతే 'అశాంతి'ని ఇంజెక్ట్ చేస్తుంది. అది క్యాన్సర్ కన్నా ఘోరంగా తినేస్తుంది!

* * *

మిత్రుడు విశ్వం ఫోన్ చేశాడు. అతడు జర్మనీలో వుంటున్నాడు.

"ఎంతదాకా వచ్చింది నీ రీసెర్చి..."

"కుంటుతోంది..." బాధగా నవ్వేడు.

"ఇండియాతో వచ్చిన చిక్కే ఇది. సరైన ఫెసిలిటీస్ కల్పించరు. ప్రోత్సాహమూ ఇవ్వరు. అలాటి వాటికి ఇక్కడ ఇన్‌ఫ్రాస్ట్రక్చరూ ఫెసిలిటీసూ బావున్నాయి....."

"ఆహా... ఇంకేమిటి బాసూ..."

"మా యూనివర్సిటీలో ప్రొఫెసర్ వేకెన్సీ వచ్చింది. నీ క్వాలిఫికేషన్స్ మోర్ దేన్ ఎనఫ్. ఓ రెండు నెలల పాటు జర్మనీ లాంగ్వేజ్ నేర్చుకుంటే చాలు. హై శాలరీ. నో వర్రీస్ నో టెన్షన్స్. హ్యాపీగా వుంటుంది. నీకు ఇంటరెస్టుందేమో కనుక్కుందామని చేశాను..."

"వద్దులే. ఇదేదో తేలనీ..."

"అది తేలితే నిన్ను ఆకాశానికెత్తేస్తుంది. లేదా నిలువునా ముంచేస్తుంది. అంత

రిస్కు తీసుకోవడం అవసరమా? బీ ప్రాక్టికల్ మ్యాన్. ఏ వృత్తి అయినా బతకడానికే. బాగుపట్టానికే"

"ఐ లైక్ దిస్ ప్రాజెక్ట్... యూ నో దిసీజ్ క్లోజ్ టు మై హార్ట్"

"దెన్ గో ఎహెడ్. నీ తెలివితేటలు శక్తిసామర్థ్యాలు వృథా అవుతున్నాయని చెబుతున్నానంతే. రీథింక్ ఇఫ్ పాజిబుల్" ఫోన్ పెట్టేశాడు.

"ఫోన్ ఎక్కడ్నుంచీ" భార్య అడిగింది. మిత్రుడి ప్రపోజల్ గురించి చెప్పేడు.

"హుం! మీరు సుఖపడరు. మీరు కట్టుకున్న దాన్ని సుఖపెట్టరు! ఎక్కడో అడివి మనిషి. ఖర్మ కొద్దీ నాకు తగిలారు!"

ఆమె మాటలు ఇనుప మేకుల్లా గుండెల్లో గుచ్చుకున్నాయి. గంభీరంగా మారిపోయాడు.

"నా ఫ్రెండ్ భానుమతి గుర్తుందిగా? ఆ మధ్య మ్యారేజ్ యానివర్సరీ సితార హోటల్లో గ్రాండ్‌గా చేశారూ...!"

"ఆఁ ఆఁ గుర్తుంది. ఆమెకేమైంది?"

"గేటెడ్ కమ్యూనిటీలో విల్లా కొన్నారు. మాడ్యూలార్ కిచెనూ ఖజానా వారి పర్నిచరూ - అబ్బో పోష్‌గా వుంటుందిట. ఒన్ క్రోర్ ఫైవ్ లాక్స్. భానుమతి ఇన్ఫొసిస్‌లో ఆమె హజ్బెండ్ టీసీఎస్‌లో పని చేస్తున్నారు. వాళ్లకా లోన్స్ ఓ లెక్కేకాదు. ఇవాళ రేపు మనుషుల్ని వారింటిని బట్టీ ఇంట్లోని ఫర్నిచర్ని బట్టీ లెక్కేస్తున్నారు. ఆ సంగతి మీకీ జన్మలో అర్థమవుతుందనుకోను. ఏమైనా అంటే నోరు పారేసుకున్నట్టవుతుంది!"

సణుగుతూనే కామెంటు చేస్తూనే రెడీఐ కార్లో ఆఫీసుకెళ్లిపోయింది రమ్య.

గాలివాన వెలిసినట్టుగా ఫీలయ్యాడు విజయ్. బ్రేక్ ఫాస్ట్ చెయ్య బుద్ధి కాలేదు. అనీజీగా అన్‌రెస్ట్‌గా ఉంది. అమ్మ గుర్తొచ్చింది.

మరి పది నిమిషాలకి తండ్రి ఇంటికెళ్లాడు విజయ్. ఇది వరకు వాళ్లతోనే కలిసుండేవారు. అత్తా కోడళ్లకి పొసగలేదు. వేరింటి కాపురం పెట్టక తప్పలేదు.

"ముఖం అలా పీక్కుపోయిందేంట్రా...!" అనింకేదో అనబోయి మ్రింగేసింది తల్లి.

టిఫిన్ తెచ్చి పెట్టింది. మౌనంగా తిన్నాడు.

"నీ రీసెర్చి ఎంత దాకా వచ్చిందిరా అబ్బాయ్." లాలనగా అడిగింది.

బరస్టయ్యాడు. తల్లి ఒడిలో తలపెట్టుకొని బావురుమన్నాడు. ప్రేమగా ఓదార్చింది.

సేదదీరాడు.

"మళ్లీ ఫెయిలయ్యాను మమ్మీ... మైస్ మీద సక్సెస్సయింది గాని రాబిట్స్ మీద వర్కవుటవ్వట్లేదు. అదైతే తప్ప హ్యూమన్స్ మీద ట్రై చెయ్యలేను..."

"అసల్నువ్వు దేని గురించి పరిశోధిస్తున్నావు?"

"కేన్సర్ కన్నా కేన్సర్‌కి చేసే ట్రీట్‌మెంట్ ప్రమాదకరంగా వుంటోందమ్మా. దాని సైడ్ ఎఫెక్ట్స్ వల్ల చాలామంది చనిపోతున్నారు. ముఖ్యంగా కీమోథెరపీ దుష్ప్రభావాలు అధికంగా ఉంటున్నాయి. కీమో చేసినప్పుడు ఒంటిమీది వెంట్రుకలన్నీ రాలిపోవడం మనిషి అకాల వృద్ధాప్యం వచ్చినట్టు వికృతంగా మారటం చూసే ఉంటావు. అలా ఎందుకు జరుగుతుందంటే ఆ ట్రీట్‌మెంట్ కాన్సర్ కణాలనే గాక మంచి కణాలనీ నాశనం చేస్తుంది. అలా గాకుండా కేవలం కేన్సర్ కణాలనే ముట్టుపెట్టేట్టు ట్రీట్‌మెంటివ్వ గలిగితే కేన్సర్‌ని ఈజీగా నయం చేయొచ్చు..."

ఆమె కళ్లు మెరిశాయి. "మరింకెందుకాలస్యం? మళ్లీ ప్రయత్నించరా!"

" ఆ ప్రయత్నమే చేస్తున్నా. డ్రగ్ - అతి చిన్నది. టూ నానో మీటర్ వుంటుంది. గోల్డ్ కోటింగిచ్చి ఇంజెక్షన్ ద్వారా పంపిస్తాం. అది శరీరమంతా తిరిగి కాన్సర్ కణాలున్న చోటు కెళ్తుంది. అక్కడ ఎసిడిటీ 4.6 పీహెచ్ దాకా వుంటుందిలే.. అక్కడి కెళ్లేక డ్రగ్ పైనుండే తొడుగు కరిగి డ్రగ్ రిలీజవుతుంది. అది కేన్సర్ కణాల్ని మాత్రమే నాశనం చేస్తుంది. అంచేత సైడ్ ఎఫెక్ట్స్ ఉండవు. త్వరగానూ నయమవుతుంది. ఎలుకల మీద ప్రయోగించగా సక్సెస్ అయింది. కుందేళ్ళ మీద ప్రయోగిస్తున్నాం. ఇంకా సక్సెస్ కాలేదు. సక్సెస్ అయితే మాత్రం మనుషుల మీదా విజయవంతమై తీరుతుంది...!"

గబుక్కున లేచొచ్చి కొడుకు నుదుట ముద్దు పెట్టుకుంది. "ప్రాణదానం చేసే పనిరా. చెయ్యిరా నాన్నా. కృషితో నాస్తి దుర్భిక్షం అన్నారు. నీ మంచి పనికి పరమాత్మ సైతం అండగా నిలుస్తాడురా!"

విజయ్‌కి ఎంతో సంతోషం వేసింది. పిసరంత గర్వమూ కలిగింది.

ఇవాళ తన పరిశోధన విలువని తన ప్రత్యేకతని అమ్మ గుర్తించింది. రేపు ప్రపంచం గుర్తిస్తుంది. అప్పుడు రమ్య సైతం హారతి పడుతుంది!

ఆ ఊహకే ఉత్తేజితుడయ్యాడు. "ఓకే మామ్... మరింత కాన్ఫిడెన్స్‌తో రెట్టింపు డెడికేషన్తో పనిచేస్తా. ఏదో ఒకరోజున ఐ విల్ రీచ్ మై గోల్!"

విజయ్ కళ్లల్లో మెరుపులు కురిశాయి. పొంగిపోయింది మాతృహృదయం!

* * *

పెళ్లికి భీమవరం వెళ్ళారు.

పట్టుచీర కట్టుకుని బంగారు నగలు ధరించి పుత్తడి బొమ్మలా మారిపోయింది రమ్య. భార్య గొడవ భరించలేక టక్ చేసినా సాదా సీదాగా వున్నాడు విజయ్.

అంతా రమ్యని పలకరిస్తున్నారు. ఆప్యాయంగా కావలించుకుంటున్నారు. ఆమె కట్టుకున్న చీర గురించీ ధరించిన నగల గురించీ ఆరా తీస్తున్నారు. ఆ వెంటనే ఆమె జీతం గురించడిగి ఆరంకెల జీతం అని తెలీగానే అసూయగా చూసి నిట్టూరుస్తున్నారు.

"మీ ఆయనా కంప్యూటర్ ఇంజినీరేనా? వచ్చారా?" ఒకరడిగారు.

"సైంటిస్టు... అదిగో అక్కడ కూర్చున్నారు"

"డాక్టర్ కదా ప్రాక్టీసుపెడితే ఆపరేషన్‌కి లక్ష వస్తుందిగా" ఎవరో సలహా ఇచ్చారు.

"ఆ డాక్టరైతే బాగానేవుణ్ణు. డాక్టరేట్ చేసి డాక్టరయ్యారంతే'

అదేం డాక్టరో తెలీక అయోమయంగా చూసి మాట మారుస్తూ "నిన్ను అమెరికా పంపిస్తారటగా. మీ అమ్మ చెప్పింది. ఎప్పుడు వెళ్తున్నావూ? నీతో బాటు మీ ఆయనా వస్తాడా?" అడిగిందో బంధువు.

"ఊహుఁ. ఒక్కద్దాన్నే వెళ్తాను"

"ఒక్కద్దానివే వెళ్తావా?" ఆమె కళ్ళనిండా ఆశ్చర్యం!

"అది స్వర్గమే, నరకం కాదు కాల్చుకు తిండానికి!" నవ్వింది.

"ఎలాగైనా నువ్వు గ్రేట్!" అభినందించారొకరు.

"అలాటిలాటి గ్రేట్ కాదు గ్రేటెస్ట్ ఉమన్. నెలకి లక్షకి పైనే సంపాదిస్తోందంటే మాటలా. టీమ్ లీడ్. టీమ్‌లో అంతా మగాళ్ళే. వాళ్ళకి లీడర్. ఇల్లూ స్థలాలూ చాలా కొన్నది. రమ్యలా సక్సెస్ అయిన వాళ్ళు చాలా అరుదుగా వుంటారు. వీళ్ళాయనది కూడా పెద్ద ఉద్యోగం అయివుంటే ఈ పాటికి చుక్కలు చూసేది" క్లాస్‌మేట్ అంది.

అంతదాకా ఏనుగు అంబారీ ఎక్కినట్టు పొంగి పోతున్నదల్లా ఆ చివరి మాటలకి ఉలిక్కిపడింది. మొఖం నల్ల బడింది.

"ముందొచ్చిన హైదరాబాద్ సంబంధం చేసుకునుంటే నీ పని రంగరంగ వైభోగంగా వుండేదే" అందో స్నేహితురాలు.

పెదవి కొరుక్కోకుండా వుండలేకపోయింది రమ్య. రాత రాజ్యమేలుతోంటే బుద్ధి బురదలోకి లాగటమంటే ఇదేనేమో!

నిట్టూర్చింది.

"ఇప్పుడైతే ఏంటే. మీ ఆయన్ని నీ దార్లోకి లాక్కు పో. నీలాగే సంపాదిస్తాడు!"

తల పంకిస్తూ ఏదో అనబోయిందల్లా మరెవరో పిలవడంతో అటు వెళ్ళిపోయింది రమ్య.

వధూవరులు ఒకరి తలమీద ఒకరు జీలకర్రా బెల్లం పెట్టుకున్నారు. బాజాలూ మ్రోగాయి. అతిథులు జంటలుగా వెళ్ళి అక్షింతలు వేస్తున్నారు.

రమ్య విజయ్‌ని పిలిచింది. తాపీగా వచ్చాడతడు.

"మెడకి డోలు తగిలించుకున్నట్టుగా వుంది..." విసుక్కున్నట్టుగా అంది.

అతడి నుదురు ముడి వడింది.

"అందరి ముందూ తలకొట్టేసినట్టుగా వుంది. మీరు కూడా సాఫ్ట్‌వేర్‌లోకి మారిపోండి..." మొహం ఎర్రగా చేసుకుని చెప్పింది.

మందహాసం చేశాడతడు. "నా పాషన్ నీకు తెలుసుగా. లైఫ్‌లో కుచ్ బననా హై"

"ఇప్పుడలాగే అన్పిస్తుంది. తర్వాత కాళ్ళు లాక్కొస్తాయి. కడకేమీ కాకుండా పోతారు. నా మాటవింటే నాలుగైదేళ్ళలో కోటీశ్వరులమైపోవచ్చు..."

ఆ మాటల కన్నా అప్పుడామెకళ్ళల్లో మెరిసిన మెరుపులకి ఆశ్చర్యచకితుడయ్యాడు. పిచ్చిగా చూశాడు.

"ఇప్పుడు మనకేం తక్కువ చెప్పు?"

"అబ్బో అన్నీ ఎక్కువే. అవన్నీ నేను సంపాదించినవేనని మర్చిపోకండి. మీ లిక్కూ లిక్కూ సంపాదన కారు పెట్రోలుకే చాలదు!"

హతాశుడయ్యాడు. మొఖం మ్లానం కాగా మౌనం వహించాడు.

"మీ ఆయనకి క్లాసు పీకుతున్నావేంటే" ఒకతను చురక వేసే సరికి చప్పున వెనుదిరిగి చూసింది.

రాజారావు!

నల్లగా లావుగా పెద్ద బొజ్జతో ఉన్నాడు. తెల్లఫాంటు మీద గోల్డ్ కలర్ ఖద్దరు చొక్కా తొడుక్కున్నాడు. మెడలో లావుపాటి బంగారు చెయిన్లు, పదివేళ్ళకీ ఉంగరాలు, బ్రాస్

లెట్లు...!

అతడిదీ భీమవరమే. అప్పట్లో రొయ్యల చెరువులు చేస్తూండేవాడు. తనని అతడికిచ్చి చెయ్యమని వాళ్ళే కబురంపారు. చదువు తక్కువని కాదనేసింది. ఎక్కువ చదివాడని సైంటిస్టని విజయ్ సంబంధం మీద మోజు పడింది. తర్వాత రాజారావు హైదరాబాద్ షిఫ్ట్ అయి రియల్ ఎస్టేట్ రారాజుగా వెలుగుతోంటే విజయ్ మాత్రం గొర్రెతోకలా వుండి పోయాడు!

చిన్నగా నవ్వి పక్కకి తప్పుకుంది. బంధువులంతా రాజారావు కెదురొచ్చి మరీ తోడ్కొని వెళ్ళారు. ఒకరేమో 'గుడికట్టిస్తున్నాం చందా ఇవ్వ' మని అడగ్గా 'పాతిక వేలు రాసుకో' అంటూ మండపంలో కెళ్ళాడు.

అతడి వెంట ఓ బృందమే కదిలింది.

పందిట్లోని అతిథులంతా తలలు తిప్పి 'ఎవరాయన' అన్నట్టు చూస్తున్నారు. ఆ చూపుల్లో ఎనలేని గౌరవం వుంది!

మరి భరించలేకపోయింది రమ్య.

"కూర్చోండి, తర్వాతెళ్దాం..." మొఖం కందగడ్డకాగా విజయ్‌ని కసిరి మరో ప్రక్క కెళ్ళింది.

అంతా అతడ్నో 'పిపీలికం' లా చూస్తోంటే అవమానంగా వుందామెకి. సంపాదన, ఆస్తిపాస్తుల్ని బట్టే సమాజంలో గుర్తింపూ గౌరవం లభిస్తాయనుకొంది పదే పదే.

రాజారావు వెళ్ళిపోయాక వచ్చి "అలా దిక్కులు చూస్తున్నారేంటి రండి... అవతల అంతా అక్షింతలు వేసేస్తున్నారు..." అంది దారితీస్తూ.

ఆమె విసవిసా ముందు నడవగా అతడనుసరించాడు. ఒక చోట ఆగింది. అతడూ ఆగాడు.

"అదిగో ఆవిడ పెట్టుకున్న వజ్రాల నెక్లెస్ చూడండి ఎంత బావుందో. అలాటిది కొనుక్కోవాలని ఎప్పట్నుంచో ఆశగా వుంది. ఎప్పటికి కుదురుతుందో. ఎప్పటికైనా నేనే కొనుక్కోవాలి గాని మీ వల్ల లాభం లేదుగా!" నిస్పృహగా అంది.

జంటగా వెళ్ళి అక్షింతలు వేసి గిఫ్టుఇచ్చి భోజనాల దగ్గరకి నడిచారు.

ఇద్దర్లోనూ ఏ కోశానా ఉత్సాహం లేదు.

మర్నాడు విజయ్ మావగారింట్లో కాఫీ త్రాగుతూ పేపర్ తిరగేస్తోంటే అతడి మావగారు

"ఏం జేస్తున్నావయ్యా" అంటూ వచ్చి ఎదురుగా కూర్చున్నాడు.

క్లాసు పీకుతారని అర్థమైంది. చిన్నగా నవ్వి వూరుకున్నాడు.

"భవిష్యత్తు గురించేం ఆలోచిస్తున్నావయ్యా"

అయోమయంగా చూశాడు. ఆయన ప్రశ్న నిజంగానే అతడికి అర్థంకాలేదు.

"గొడ్డుకి తిన్నది పుష్టి మనిషికి ఉన్నది పుష్టి అన్నారు పెద్దలు. ఎంతెక్కువ ఆస్తిపాస్తులు కూడబెడితే అంత గొప్ప. నాయకులైనా అధికార్లైనా సవాలక్ష అడ్డదార్లు తొక్కి అయినా సరే సంపాదించేది అందుకే. అమ్మాయి ఒక్కతే ఎంతకని పరుగెట్ట గలదు చెప్పు. నువ్వొ ఓ చేయివేస్తే....."

"డబ్బు ఒక్కటే ముఖ్యం కాదు కదండీ. ఇంకా చాలా చాలా వున్నాయి. వృత్తిలో తృప్తి ముఖ్యం!"

"సంపాదన బావుంటే చాలు అన్నీ అవే నడిచొస్తాయయ్యా. బీటెక్ చేసిన అమ్మాయి లక్షలు సంపాదిస్తోంటే ఇహ డాక్టరేట్ చేసిన నువ్వెంత సంపాదించాలి చెప్పు?"

విజయ్ ఏదో అనబోతోంటే, "రమ్యకి ఇంజినీర్నే చూడమని చెవినిల్లు కట్టుకుని పోరాను. మీరు వింటేగా!" ఖాళీ కాఫీ కప్పు తీసుకెళ్తూ అల్లుడి వంక కించిత్తు నిరసనగా చూస్తూ అంది అత్తగారు.

విజయ్ మొహం జేవురించింది.

"అహహ నిన్నేదో చిన్న బుచ్చాలని కాదు... నీకు తెలుసుగదయ్యా. ఇవాళ రేపు మనిషిని డబ్బుతో కొలుస్తున్నారు..... పూర్వం రాజ్యాలు జయించిన వాడ్ని విజేత అన్నారు. ఇప్పుడు బోల్డంత డబ్బు సంపాదించిన వాడ్నే విజేత అంటున్నారు. ఎంత కాలమని ముష్టి పాతికవేలు జీతంతో సరిపెట్టుకుంటావు చెప్పు. నేనన్నానని కాదు నువ్వొ ఆలోచించు....సిరి సంపదల్లో తులతూగాలని నీకు మాత్రం వుండదేవిటీ...!"

"ఆయన నాకన్నా తెలివైన వారు నాన్నా. ఒక్క నెలరోజులు షేర్ పాయింటో సీబెల్సో నేర్చుకుంటే చాలు మా కంపెనీలోనే నా రిఫరెన్సుతోనే ఏడెనిమిది లక్షల ప్యాకేజ్‌తో చేరొచ్చు..." రమ్య అంది.

"మరింకేమయ్యా. హైదరాబాదెళ్తూనే ఆ ఉద్యోగానికి రాజీనామా ఇచ్చేసి అమ్మాయి చెప్పిన కోర్సులు చేసెయ్యి...."

విజయ్ మాట్లాడలేదు.

అతడి మనస్సులో రెండు విరుద్ధ భావాలు సంఘర్షించుకుంటున్నాయి. పదిమందికి ఉపయోగపడేదేదో సాధించాలన్న తపన ఆవేశం ఒకప్రక్క, తన వాళ్ళని సంతృప్తి పర్చడానికి ఇంకో దారి పట్టక తప్పదన్న ఆవేదన, బాధ మరో ప్రక్క!

"అల్లుడు గారు మంచివారు. మన పాయింటు అర్థం చేసుకున్నారు" అన్నారు మావగారు కూతురివంక సంతోషంగా చూస్తూ.

"ఇద్దరం ఒకే లైన్లో వుంటే ఎంతో హాయి నాన్నా. కలిసి వెళ్ళొచ్చు రావొచ్చు. ఆన్‌సైట్‌కి అమెరికా వెళ్ళాల్సొచ్చినా ఇద్దరం వెళ్ళొచ్చు..."

"మన పొలం సరిహద్దులోని చంద్రరావు గారి అయిదెకరాల మామిడి తోట అమ్మకానికుంది. మీరేం చేస్తారో ఎలా చేస్తారో తెలీదు. మీరు దాన్ని కొనెయ్యాలి" అంది రమ్య తల్లి.

"ఆయన సాఫ్ట్‌వేర్లోకి మారాలి గాని అదెంత సేపూ. అప్పులిస్తామని రోజూ ఎన్ని బ్యాంకుల వాళ్ళు మా చుట్టూ తిరుగుతుంటారో లెక్కలేదు!"

"మారతారమ్మా. సుఖం అనే పదార్థం డబ్బు అనే యథార్థం ప్రక్కనే వుంటుందని అల్లుడు గారు గ్రహించార్లే..."

తండ్రి మాటలకు భరోసా చిక్కగా భర్త వంక ఆశగా చూసింది రమ్య.

ఆలోచనల బరిణెలా వున్నాడతడు. అతడి అంతర్మథనం గ్రహించే ప్రయత్నం చెయ్యలేదు. ఆలోచనల మంటల్లో రగలనీ రాటుదేలతాడనుకుంటూ 'మీరజాలగలడా' అని లోలోపల అనుకుంటూ లోపలి కెళ్ళిపోయింది.

ఘన పదార్థాన్ని కేజీల్లో ద్రవపదార్థాన్ని లీటర్లలో కొలుస్తారు. మనిషిని డబ్బుతో కొలుస్తారు !

తనని అర్థం చేసుకునే వారు – అమ్మ తప్ప ఒక్కరూ లేరు. ప్రోత్సాహం మనశ్శాంతి ఉత్సాహం ఉద్వేగం లేకుండా ఎంతకాలం ఎదురీదగలడు?

రమ్య కోరుతున్నట్టు రీసెర్చికి గుడ్‌బై చెప్పి సాఫ్ట్‌వేర్ భాగ్యవంతుల్లో కలిసిపోతే సరి! కనీసం రమ్య అండ్ కో హ్యాపీగా వుంటారు.

ఒక నిశ్చయానికొచ్చాడు విజయ్. అది మరింత బాధకి గురి చేసింది తప్ప పిసరంత సంతోషపెట్టలేకపోయింది!

ఇంతలో పెద్ద పెట్టున ఏడ్పులు విన్పించాయి.

"పుల్లారావు పోయాడనుకుంటా....." వీథిలో కెళ్తూ అన్నారు విజయ్ మావగారు.

"పగవాళ్ళక్కూడా అలాటి చావు రాకూడదు. అయినా క్యాన్సరొస్తే బతుకుతారేంటీ!"

అత్తగారి మాటలకు అదిరి పడ్డాడు విజయ్.

"కేన్సర్తో పోయాడా?" ఉద్విగ్నుడై అడిగాడు విజయ్.

అతడి వంక చిత్రంగా చూస్తూ తల నిలువుగా ఆడించింది.

"ట్రీట్‌మెంట్ తీసుకోలేదా?"

"తీసుకున్నాడు. అది భరించలేకే పోయాడు" అని అత్తగారంటే, "అది చికిత్స కాదయ్యా నరకహింస" అన్నారు మావగారు.

చటుక్కున లేచి రివ్వున బయటికి నడిచాడు.

రెండిళ్ళవతలున్న పుల్లారావింటి కెళ్ళాడు.

బంధువులు, ఊరివాళ్ళు పోగవుతున్నారు. సానుభూతిగా మాట్లాడుకుంటున్నారు.

"అసలు కేన్సర్ అని ఎప్పుడు తెలిసిందీ ఏం ట్రీట్‌మెంట్ ఇప్పించారూ"

విజయ్ మాటలకు వింతగా చూశారంతా. వారి చూపుల్ని పట్టించుకోకుండా మళ్ళీ అడిగాడు.

"పదినెలల క్రితం గొంతు క్యాన్సరని తెలిసింది. విజయవాడలో చూపించారు. ఆపరేషన్ చేస్తే మాటపోతుందన్నారు. కీమోథెరపీ చేశారు. ఆ బాధ తట్టుకోలేక గోలపెట్టేవాడు. ఆ బాధ మర్చిపోడానికి వారం రోజుల్నుంచి తాగుడు మొదలెట్టాడు. ఇంతలో ఇలా అయ్యింది!"

గోడు గోడున ఏడుస్తున్నారతడి భార్యా బిడ్డలూ తల్లిదండ్రులూ!

ఇలాటి విషాద దృశ్యాలు ప్రపంచం నిండా ఎన్నో! ఎన్నెన్నో!

వారిలాటి ఒక్కరి కన్నీటినైనా తుడవగలిగితే.... మానవ జన్మకి సార్థకత చేకూరినట్టే!

తల విదిలించాడు విజయ్.

ఒక నిర్ణయం ఒక దీక్ష ఒక సంకల్పం అతడి వెన్ను తట్టింది. వెయ్యి ఏనుగుల బలాన్నిచ్చింది. భౌతిక సుఖాల వ్యామోహమూ స్వార్థపుటాలోచనల సంకెళ్లూ ఫట్‌ఫట్‌మని తెగిపోయాయి. వెనక్కి లాగుతోన్న బలహీనతల్ని అధిగమించాడు.

'నా పరిశోధనని కొనసాగిస్తాను. సక్సెస్‌ని చేజిక్కించుకుంటాను!'

విజయ్ నేటి సైనికుడు. రేపటి విజేత!

**(జాగృతి వారపత్రిక 3.6.2013)**